

ఆధార్, మీ సేవా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలో సోమవారం వివిధ మీసేవ కేంద్రాలను, ఆధార్ నమోదు కేంద్రాలను అల్లూరు జిల్లా డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ అధికారిని శాంతా లక్ష్మి తనిఖీ చేశారు. మండలంలోని వివిధ మీ సేవ కేంద్రాల్లో ఆధార్ కేంద్రం లలో రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ బోర్డుల ప్రదర్శన, వివిధ అంశాలపై అధికారులు తనిఖీ నిర్వహించారు.



రికార్డులు పరిశీలిస్తున్న శాంతాలక్ష్మి

నాడు - నేడు పనులు వేగవంతం చేయాలి

- డ్రాపౌట్స్‌పై సమాచారం ఇవ్వకపోతే చర్యలు - కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో రెండవ విడతలో మంజూరు చేసిన మన బడి నాడు నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో ఆన్లైన్లో నమోదు చేయాలని స్పష్టం చేసారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులతో సోమవారం మనబడి నాడు నేడు రెండవ విడత పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా అందుబాటులో ఉన్న నిధులపై ఎంఇలను అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనులకు నిధుల కొరత లేదని, జాప్యం చేయకుండా పనులు చేయాలన్నారు. ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పాఠశాలలకు తాగునీటి, ఇతర మౌలిక సదుపాయాల పనులు నిర్దిష్టమైన సమయాలనికి పూర్తి చేయాలని చెప్పారు. అంగన్వాడీల భవన నిర్మాణాలకు నిధులకు కేటాయించిన ఉత్తర్వుల మేరకు నిధులు బదలాయించాలని చెప్పారు. బ్యాంకుఖాతాలలో ఉన్న నిధులపై ఆరా తీసారు. 10,11 తేదీలలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మన బడి నాడు పనులను పర్యవేక్షించి పనుల పురోగతిపై ఎంఇఓలకు నివేదించాలని సూచించారు. వచ్చే సోమవారం సమీక్షిస్తానన్నారు.

పాఠశాలల వారీగా డ్రాపౌట్ల విద్యార్థుల వివరాలు ఇవ్వని విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. భవనాలు లేని పాఠశాలలు, కొత్త పాఠశాలలు ఎన్ని అవసరం ఉందో పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని చెప్పారు. చైల్డ్ ఇన్ఫో వెబ్ సైట్లో ఉన్న విద్యార్థుల వివరాలకు, వాస్తవానికి ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, వ్యత్యాసాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు విధిగా ఎఫ్ఆర్ఎస్ వేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.గౌరీ శంకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి.ఆర్.ఎం. రాజు, సమగ్ర శిక్ష ఎపిఓ ఎస్.ఎల్.ఎన్ పాత్రుడు, మండల విద్యాశాఖాధికారులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు, మండల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రత్యామ్నాయ విధానాలతోనే అభివృద్ధి

- ★ రంపచోడవరం కేంద్రంలో మరో ఏజెన్సీ జిల్లా ఏర్పాటు చేయాలి
- ★ 15న బహిరంగ సభకు తరలిరావాలి
- ★ సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి కిరణ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రత్యామ్నాయ విధానాలతోనే రంపచోడవరం నియోజకవర్గం అభివృద్ధి సాధ్యపడుతుందని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. రాజవొమ్మంగిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ, జిల్లాల పునర్వ్యవస్థీకరణలో రంపచోడవరం ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా రంపచోడవరం, చింతూరు, పోలవరం ఐటిడిఎలను కలిపి రంపచోడవరం కేంద్రంగా మరో ఏజెన్సీ జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా రంపచోడవరం, చింతూరు, పోలవరం ఏజెన్సీ ప్రాంతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు వంటి కనీస మౌలిక సౌకర్యాలు లేక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నేతలు తమ రాజకీయ స్వలాభం కోసం పాకలాడుతున్నారు తప్ప ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కృషి చేయడం లేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంత సమస్యలు పరిష్కారం కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం సిపిఎం నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు కుమ్మక్కై, గిరిజనుల రక్షణ చట్టాలను సవరించి ఆదివాసీలను అడవి నుంచి గెంటేసి కుట్ర చేస్తున్నాయని విమర్శించారు.

జిఒ 3, గిరిజన హక్కులు, చట్టాలు పటిష్ట అమలు, పోడు భూములకు పట్టాలు, ఆదివాసీ స్పెషల్ డిఎస్సి, జీడిపిక్కల పరిశ్రమ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, పీహెచ్‌సిల్లో సౌకర్యాలు, ఉపాధి హామీ ద్వారా 200 దినాల పనులు, అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు తదితర సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న రంపచోడవరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, దీనికి వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి బాబురావు, రామరాజు, ప్రజా సంఘాల నాయకులు కె నూకరాజు, ఎం సింహాచలం, పి ప్రసాద్, దేవి, నాగమణి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి -పాడేరు: ఉపాధ్యాయ బదిలీలు ముగిసి నాలుగు నెలలు గడిచినప్పటికీ విద్యాశాఖ లో మాత్రం అధికారులు దొడ్డి దారిన బదిలీలు చేస్తున్నారని, ఇది దుర్మార్గమని యుటిఎఫ్ జిల్లా కమిటీ కార్యదర్శి వి.మహేశ్వరరావు విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు మే నెలలో జరిగిన బదిలీల కౌన్సిలింగ్‌లో పెందుర్తి మండలంలో బదిలీపై వెళ్లారని కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ రాజకీయ నాయకుల సహకారంతో మళ్ళీ అనంతగిరి మండలంలో దొడ్డి దారిలో బదిలీపై వచ్చారన్నారు. తక్షణమే ఈ బదిలీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.దొడ్డి దారి బదిలీలు రద్దు చేయకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేపడతామని జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షులు సి.హెచ్. నాగేశ్వరరావు, కార్యదర్శులు కె.రఘునాథ్, పి.దేముడు, జిల్లా కో-కన్వీనర్ యం. బాబురావు లు పాల్గొన్నారు.

రంగురాళ్ల క్వారీల మూసివేత

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రానికి సమీపంలోని తపస్సు కొండ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో సాగుతున్న రంగురాళ్ల తవ్వకాలు, వ్యాపారాలపై యథేచ్ఛగా రంగురాళ్ల తవ్వకాలు అన్న శీర్షికన సోమవారం ప్రజాశక్తి ప్రచురించిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. అటవీ, పోలీస్ శాఖ అధికారులు సోమవారం తపస్సు కొండ రిజర్వు ఫారెస్ట్ ఏరియాను సందర్శించి రంగురాళ్ల క్వారీలను మూసివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగురాళ్ల క్వారీలకు వెళితే కఠినమైన శిక్షలు ఉంటాయని దుప్పులపాలెం, చిన్న మునకనగడ్డ గ్రామాల ప్రజలను హెచ్చరించారు. ఎవరూ ఫారెస్ట్ ఏరియాకు వెళ్ళకూడదని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో అటవీ, పోలీసుశాఖ అధికారులు పాల్గొన్నారు.



రంగురాళ్లు తవ్వకాలు చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీ, పోలీసు శాఖల అధికారులు



స్థలాన్ని పరిశీలిస్తున్న జెసి శ్రీనివాసరావు

ఆర్‌డిఒ కార్యాలయ స్థలం పరిశీలన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని నూతన ఆర్డీవో కార్యాలయానికి స్థల పరిశీలన జెసి శ్రీనివాసరావు సోమవారం చేపట్టారు. మండలంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జెసి శ్రీనివాస్ ఆర్డీవో కార్యాలయ ఏర్పాటును వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఆర్డీవో కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పై పెచ్చులు ఊడిపడి పోతుండటంతో భయంతో విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది జేసీకి తెలిపారు. అనంతరం నూతనంగా మరమ్మతులు చేపడుతున్న తహసిల్దార్ కార్యాలయం నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. తహసిల్దార్ కార్యాలయం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజలక్ష్మి, ఆర్ఐ రంగారావు, వీఆర్వో కొండబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు-2లో విద్యార్థులతో వెట్టి చాకిరి చేయిస్తున్న దారుణం బయటపడింది. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. హాస్టల్ నిర్వాహకులు చేయాల్సిన పనులు విద్యార్థులతో కోళ్ల దుకాణం నుంచి చేత పట్టుకుని హాస్టల్‌కు తీసుకువెళ్తున్న దృశ్యాలు మీడియా ప్రతినిధుల కంట పడ్డాయి. ఈ విషయంపై పలువురు పాత్రికేయులు పాఠశాల డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులను సంప్రదించగా సదరు ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానం చెప్పారు. హాస్టల్లో సరిపడా వర్కర్లు లేక పోవడంతోనే విద్యార్థులతో చేయించాల్సి వచ్చిందని డిప్యూటీ వార్డెన్ బదులిచ్చారు.



కోళ్లను మోసుకెళుతున్న విద్యార్థులు

గతంలో ఇలాంటి ఘటనలు అనేకం.

మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1లో గణతంత్ర దినోత్సవ వంటి వేడుకలు నిర్వహించే కార్యక్రమాలలో విద్యార్థులతో టెంటు సామాగ్రి, కుర్చీలు భుజాలపైకి మోయిస్తూ ప్రధాన రహదారి గుండా పాఠశాలకు తరలించడం వంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి.

జిటీడబ్ల్యు బాలికల-1,2 పాఠశాలల్లో గతంలో పిక్నిక్ తదితర కార్యక్రమాలలో పాఠశాలలోని తరగతి గదులను విద్యార్థులు శుభ్రపరిచారు.

నేడు, రేపు విఒఎల ధర్నాలను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-అడ్డతీగల

వెలుగు యానిమేటర్స్ (విఒఎ) సమస్యలపై ఈ నెల 10, 11 తేదీల్లో జరుగు ధర్నాలను సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని, గ్రూపులతో సంబంధం లేకుండా అందరికీ వేతనాలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, లోకోస్ యాప్‌ను రద్దు చేయాలని తదితర డిమాండ్‌లతో ఈ ధర్నాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం గంగవరం మండల కేంద్రంలో జరిగిన సిఐటియు మండల సమావేశంలో వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వివోఏలకు మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ తీసుకొచ్చి తొలగించాలని ప్రయత్నిస్తుందన్నారు. ఎన్నో ఏళ్ల నుండి పనిచేస్తున్న వివోఏలను గ్రూపులు తక్కువ ఉన్నాయని సాకుతో జీతాలు చెల్లించకుండా తొలగించడం దుర్మార్గమన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు, స్కూల్ శానిటేషన్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాణి, సత్యనారాయణ, నాగదేవి, కుమారి రాజ్యలక్ష్మి, మంగ, మర్త వెంకటలక్ష్మి, వీరమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్



చీరలు పంపిణీ చేస్తున్న ఆప్ నేతలు

చీరల పంపిణీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని జంగిడివలస గ్రామంలో సుమారు 50 మంది గిరి మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జి సుజాత ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు డి రమణ మాట్లాడుతూ, 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అరకు నియోజవర్గం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మొస్య సుజాత పోటీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గిరిజనులు పాల్గొన్నారు.

కాన్షీరాంకు నివాళి

ప్రజాశక్తి పెదబయలు రూరల్ : మండలం కేంద్రం లో అఖిల భారత గిరిజన భవనం వద్ద కాన్షీరాం వర్ధంతిని బహుజన్ సమాజ్ పార్టీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబయలు మండల నాయకులు సీకరి చిన్నయ్య మాట్లాడుతూ, రాజ్యాధికారి చైతన్య యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి చిన్నయ్య దొర, అరకు అసెంబ్లీ ట్రెజరర్ కొర్ర రాజబాబు, గ్రామ ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.



చిత్ర పటానికి నివాళి అరిస్తున్న నేతలు



గుమ్మడి కాయలు అమ్ముతున్న గిరి మహిళ

లేత గుమ్మడి కాయలకు భలే గిరాకీ

ప్రజాశక్తి-పెదబయలురూరల్: గిరిజనులు ఆర్గానిక్ గెత్తం తో పండించిన గుమ్మడి కాయలకు గిరాకీ లభించింది. సోమవారం పెదబయలు వారపు సంతలో చిన్న సైజ్ గుమ్మడి కాయ రూ.20నుండి 50 ధర పలికింది. లేత గుమ్మడి చిగూరు కట్ట 20 రూపాయల ఖరీదు రావటంతో గిరిజనులు సంబం పడ్డారు. ఈ ప్రాంతంలో పండించిన ఆకు కూరలు, గుమ్మడి కాయలు మంచి ఆరోగ్యంగా ఉంటాయిని పట్టణ ప్రాంతానికి చెందిన పుర్ణమర్కెట్, తుని, నర్సీపట్నం, వడ్డాది, మాడుగుల, ఒడిషా కోరాపుట్, జైపూర్ తదితర ప్రాంతాలకు రవాణా జోరుగా సాగుతున్నాయి.

కాఫీ పండ్ల సేకరణ

ప్రజాశక్తి- అనంతగిరి: ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ పళ్ళ సేకరణలో రైతులు బిజీలో పడ్డారు. గత ఏడది కంటే ఈ ఏడాది సెప్టెంబర్ నెల నుండి కాపీ పళ్ళు ముందస్తుగానే పండు దశకు రావడంతో కాఫీ రైతులు సేకరణలో బిజీలో పడ్డారు. పండిన కాపీ పళ్ళు చెట్టు నుండి తీయకపోతే రెండు మూడు రోజుల్లోనే చెట్టు నుండి రాలిపోతుండంటతో ముందస్తుగానే రైతులు సేకరించి జాగ్రత్తలు పాటిస్తున్నారు. చేతికి అంది వచ్చిన ఆర్గానిక్ కాఫీని సేకరించి దానిని పల్పర్ చేసిన అనంతరం మూడు రోజులు ఆరు బయట ఎండలో ఆరవేసి రైతులు చిరు వ్యాపారస్తులకు అమ్మకాలు చేపడతారు.



కాపీ పండ్లు సేకరిస్తున్న గిరి మహిళలు

డెంగీ జ్వరాల విజృంభణ

- వైద్య సేవలు అందించాలి
- సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం

మండల వ్యాప్తంగా విష జ్వరాలు, ప్రధానంగా డెంగీ జ్వరాలు విజృంభించాయని, ప్రతి ఇంటిలోనూ జ్వర బాధితులు ఉన్నారని సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు అన్నారు. జ్వర బాధితులు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు లేని కారణంగా ప్రాణ భయంతో ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు పెడుతున్నారని పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత సమస్యను గడిచిన రెండు సంవత్సరాల నుండి సిపిఎం ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చెవిటి వాడి చెవిలో శంఖం ఊదినట్లు వ్యవహరించారు తప్పా వైద్యులను నియమించలేదని విమర్శించారు. దీంతో పోలిపాక గ్రామంలో ప్రజలు డెంగీ సమస్యతో బాధపడుతుందని, ముల్లూరు గ్రామానికి చెందిన డెంగీ రోగులు భద్రాచలం ప్రైవేటు వైద్యశాలలో వేల రూపాయలు ఖర్చు చేసి చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందక వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రజలు ఆర్థికంగా కృంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్పా మండల ప్రజలకు వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లను నియమించి ప్రజల ప్రాణాలను కాపాడాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు తాళ్లూరి శ్రీనివాసరావు, జక్కుల వీరబాబు, కొండా నాగమణి, ఈశ్వర్లు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాగేశ్వరరావు, సీతారామయ్య

గ్రామాల్లో ఎస్ఐ పర్యటన

ప్రజాశక్తి -సీలేరు : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో స్థానిక ఎస్సై రామకృష్ణ సోమవారం విస్తృతంగా పర్యటించారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రాంపురం, హరిపురం, జి.నేరేడుపల్లి, రాళ్లగెడ్డ, పెద్ద గొంది, పెట్రాయి, నిమ్మ చెట్టు, చిన్న గంగవరం తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన గిరిజనులతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, సాగు తదితర అంశాలపై గిరిజన యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. గంజాయి అక్రమ రవాణా సాగు చట్టరీత్యా నేరమని, తెలిసికూడా కొంతమంది యువకులు చెడు వ్యసనాలకు బానిసై ఆ బాటలోని నడుస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. యువత మంచి మార్గాల్లో నడుచుకొని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. పోలీసుల నుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గంజాయి సాగువలన కలిగే అనర్ధాలపై అనేకసార్లు అవగాహన సదస్సులు నిర్వహించామని, గిరిజనులు ఆర్థికంగా బలోపేతం కావడానికి గంజాయి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలుగా రాజ్మా, జాపరు పండ్లు, జీడి మామిడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే యువత చైతన్యవంతులుగా మారి పరస్పరం సహకరించుకోవాలని కోరారు. అనంతరం క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు ఎస్సై రామకృష్ణ పంపిణీ చేశారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సీలేరు ఎస్ఐ రామకృష్ణ

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు


ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:యుటిఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా సోమవారం మండలంలోని పలు జిల్లా పరిషత్ పాఠశాలలను యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సందర్శించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న అనేక విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. సిపిఎస్ రద్దు చేస్తానని గద్దెనెక్కిన ప్రభుత్వం జిపిఎస్ తీసుకొచ్చిందని ఆరోపించారు. దీంతో ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఉపాధ్యాయులుకు 9వ తేదీ దాటినా జీతాలు చెల్లించకపోవడం దారుణ మన్నారు. ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ వంటి అనేక రకాల బకాయిలను చెల్లించ లేదని తెలిపారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నాడు నేడు ద్వారా సర్వాంగ సుందరంగా ప్రైమరీ స్కూల్స్ తీర్చిదిద్ది 3,4,5 తరగతులను సమీప హైస్కూల్స్‌లో విలీనం చేయడంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు స్పర్జన్ రాజు, బొట్టా రామకృష్ణ, జల్లూరు ప్రసాద్, చిట్టియ్య పాల్గొన్నారు.

ఎయులో 2 నుంచి జాతీయ సదస్సు

ప్రజాశక్తి-విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2 నుంచి 4వ తేదీ వరకు ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారని వీసీ తెలిపారు. కార్యక్రమానికి డిఎస్‌టి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ, నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యాన మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జివిఎంసి అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం ఫలితంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌నకు హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

వర్చ్యువల్ రియాలిటీపై గీతంలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-మధురవాడ : సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులలో వర్చ్యువల్ రియాలిటీ ఒకటి అని, విద్యార్థులు విఆర్‌పై అవగాహన పెంచుకుని అవకాశాలను విస్తృతం చేసుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ జెబి.సెవెన్త్ లైన్ పేర్కొన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) గీతం విద్యార్థి విభాగం ఆధ్వర్యాన సోమవారం జరిగిన వర్చ్యువల్ రియాలిటీపై వర్క్ షాప్‌ను ఆమె ప్రారంభించారు. వర్చ్యువల్ రియాలిటీ ప్రయోజనాలను వివరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.క్రాంతికిరణ్ విద్యారంగంలో వర్చ్యువల్ రియాలిటీ వల్ల ఉపయోగాలను, నూతన అధ్యయన విశేషాలను తెలియజేశారు. గూగుల్ కార్డ్స్ బోర్డ్, యూనిటీ సాఫ్ట్ వేర్ ద్వారా వర్చ్యువల్ రియాలిటీపై అవగాహన ఎలా పెంచుకోవచ్చునో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఇటిఇ ఫ్యాకల్టీ సలహాదారు డాక్టర్ పి.రాజు, కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఎస్.శారద, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : సోలార్ విద్యుత్తు వాడకం వల్ల కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఇఎఎస్ శర్మ అభిప్రాయపడ్డారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో డిసెంట్రలైజ్‌డ్ సోలార్ పవర్ సిస్టం అంశంపై సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఎఎస్ శర్మ మాట్లాడుతూ, సోలార్ విద్యుత్ చాలా చౌక అని చెప్పారు. సోలార్ సిస్టమ్‌ను కార్పొరేట్ కంపెనీలకే కాకుండా, స్వతంత్రంగా గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. సోలార్ సిస్టమ్ వాడకాలను ప్రారంభిస్తే కరెంట్ అవసరం ఉండదన్నారు. సోలార్ పవర్‌ను అభివృద్ధి చేస్తే ఆర్థిక అవసరాలు మెరుగుపడతాయని స్పష్టంచేశారు. రాష్ట్రంలో అధిక భాగం విద్యుత్తును థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి చేసుకుంటున్నామని గుర్తు చేశారు. థర్మల్ పవర్ ద్వారా ఒక మెగా వాట్ సామర్థ్యానికి రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్లు పెట్టుబడి అవుతుందన్నారు. బొగ్గు నాణ్యత తక్కువగా ఉండడంతో ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల ఖర్చు పెరుగుతుందని తెలిపారు. పవర్ స్టేషన్ల ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చించే నిధుల నుంచి రెన్యువల్ ఎనర్జీ ప్లాంట్లను గ్రామీణ స్థాయిలో నెలకొల్పేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు తయారుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం అనకాపల్లి నేత కాండ్రేకుల వెంకటరమణ, కిసాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు అక్కినేని భవాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ



సోలార్ పవర్‌పై మాట్లాడుతున్న విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ

రారెత్తిస్తున్న ఎండలు

ప్రజాశక్తి-నక్కపల్లి: వేసవిని తలపించే విధంగా భానుడు భగభగ మండుతున్నాడు. ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో కరువు చాయలు అలుముకున్నాయి. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా వేసవిని తలపించేలా భానుడు తారెత్తిస్తున్నాడు. బయటకు రావాలంటే ప్రజలు హడలి పోతున్నారు. గత రెండు నెలల నుంచి నక్కపల్లి మండలంలో ఇదే పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నెల ప్రారంభం నుంచి భానుడు ప్రచండ నిప్పులు కురిపిస్తున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. కనిష్టస్థాయిలో వుండాల్సిన ఉష్ణోగ్రతలు అక్టోబరు నెలలో సగటున రోజూ 33 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వాతావరణం వేడిగా ఉంటుంది. వాతావరణం అగ్నిగుండంగా మారడంతో ఎండల్లో తిరిగిన వారు జ్వరాల బారిన పడుతున్నారు. పాఠశాలలకు వెళ్తున్న పిల్లలు కూడా తీవ్రమైన ఎండలకు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. భవన నిర్మాణ కార్మికులు, కర్షకులు, వివిధ రంగాల కార్మికులు అక్టోబర్ నెలలో మునిపెన్నడు ఇటువంటి ఎండలు ఎప్పుడూ చూడలేదని అంటున్నారు. వర్షాలతో తడిసి ముద్దవలసిన పుడిమి ఎండ వేడిమికి బీటలు బారుతున్నాయి. వరి చేనులతో పచ్చగా కళకళలాడుతూ కనబడాల్సిన పొలాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో మండలంలో కరువు తాండవిస్తుంది .

గీతం మాస్టర్ చెఫ్ పోటీల్లో సత్తాచాటిన యువత



బహుమతులతో విన్నర్స్ టీమ్

ప్రజాశక్తి-మధురవాడ : విద్యార్థులలో పోషకాహారం పట్ల అవగాహన, ఆహార పదార్థాలను వ్యర్థంగా పారవేయకుండా జాగ్రత్త వహించడం, వివిధ ప్రాంతాల రుచులు, వాటిని వండే విధానం, వంటలలో ప్రావీణ్యం వంటివి ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన మాస్టర్ ఛెఫ్ 2023 పోటీలలో యువత సత్తా చాటారు. నలభీముల మాదిరి వివిధ కూరలు, స్వీట్లతో పాటు పళ్ళ రసాలు, పోషకాహర పదార్థాలతో న్యాయ నిర్ణేతల నాలుకలకు పనిపెట్టారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో పాటు కర్ణాటక, ఒడిశా, బెంగాల్, కేరళకు చెందిన విద్యార్థులు మాస్టర్ ఛెఫ్ టైటిల్ కోసం పోటీపడ్డారు. వంటకాలలో నైపుణ్యంతో పాటు పోటీలలో పాల్గొన్న వారు వంటింటి భద్రత, నిర్వహణలో అవగాహన కలిగి ఉండటం, ఆహర పదార్థాల నాణ్యత, పోషకవిలువలు, సరికొత్త రుచులు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నియమ నిబంధనలను పాటించడం వంటి అంశాల ఆధారంగా విజేతలను ఎంపిక చేసినట్లు గీతం హస్పిటాలిటీ విభాగం కార్పోరేట్ ఎగ్జిక్యూటివ్ ఛెఫ్ ఎ.రూపేశ్వరరావు తెలిపారు. పోటీలకు హజరైన గీతం ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు.

నేరాలు ఘోరాలు

24 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చీడికాడ:అక్రమంగా అడ్డదారిలో గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని చీడికాడ ఎస్సై రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో చీడికాడ మండలం అర్జునగిరి గ్రామంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులను 24 కేజీల గంజాయి తో పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుండి రూ.45 వేలు, నాలుగు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండుక్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. వీరిలో ఇద్దరు తమిళనాడుకి చెందిన వ్యక్తులుగానూ, మిగతా ఇద్దరిలో ఒకరు మాడుగుల మండలం కోటపాడు కి చెందిన వ్యక్తి కాగా మరొకరు చీడికాడ మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎస్సై తెలిపారు.

ప్రహరీ కూలి విద్యార్థి మృతి

ప్రజాశక్తి పాయకరావుపేట: స్థానిక పట్టణ దుర్గ నగర్ ఎంపీయూపీ స్కూల్లో విషాధం చోటుచేసుకుంది. పాయకరావుపేట దుర్గా నగర్ లో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాలలో చదువుతున్న తులసి సిద్ధూ ప్రసన్న (8)పై ప్రహరీ గోడ కూలి మృతి చెందినట్లు పాయకరావుపేట ఎస్సై రమేష్ తెలిపారు.పోలీస్‌ల కథనం మేరకు దుర్గా నగర్ లో ఉన్న మండల ప్రజా పరిషత్ పాఠశాల లో చదువుతున్న విద్యార్థి తులసి సిద్దు ప్రసన్న తలపై నిర్మాణంలో ఉన్న భవనం పై స్లాబ్ రాయి ప్రమాదవశాత్తు పడి గాయం కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలియజేశారు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష

ప్రజాశక్తి- ఆనందపురం : ఒక హత్య కేసులో ఆనందపురం గ్రామానికి చెందిన బోద రామునాయుడుకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ నాలుగో అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.శ్రీహరి తీర్పునిచ్చారు. తీర్పు వివరాలను స్థానిక పోలీసులు మీడియాకు విడుదలచేశారు. 2012వ సంవత్సరంలో ఆనందపురంలో మీసాల సూర్యనారాయణ, మీసాల అప్పలనాయుడుకు బోద రామునాయుడుకు వివాదం తలెత్తింది. ఈ వివాదంలో మీసాల అప్పలనాయుడు, మీసాల సూర్యనారాయణపై బోద రామునాయుడు గొడ్డలితో దాడిచేశాడు. ఈ ఘటనలో మీసాల అప్పలనాయుడు మృతి చెందాడు. దీనిపై ఆనందపురం పోలీసులు విచారణ అనంతరం కేసు కట్టారు. కోర్టు విచారణలో సదరు వ్యక్తి పాత పగతో హత్య చేసినట్లు రుజువు కావడంతో బోద రామునాయుడుకు పై విధంగా శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఇళ్లపై విద్యుత్ వైర్లు తొలగించాలి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో వైయస్సార్ కాలనీలో ప్రజలు నివశిస్తున్న ఇళ్ళపై నుండి, ఇళ్ళు మధ్య నుండి వేలాడుతున్న ప్రమాదకరమైన విద్యుత్ వైర్లను వెంటనే తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వైయస్సార్ కాలనీలో ప్రజల ఇళ్లపై నుండి ప్రమాదకరమైన విద్యుత్ వైర్లు వెళ్లడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతూ భయాందోళనలతో బిక్కు బిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మిన సత్యవతి, మొల్లి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పోటీ చేస్తా : పెదపాటి అమ్మాజీ

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్కిల్ డెవలప్మెంట్ స్కాంలో నారా చంద్రబాబు నాయుడు అవినీతి చేసి రాష్ట్ర ప్రజల సొమ్మును తన సొంత ఖాతాలోకి జమ చేసుకొని జైలు పాలయ్యారని, ఈ విషయమై తమ పార్టీ నేతలను టిడిపి నేతలు విమర్శలు చేయడం తగదనిరాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపాటి అమ్మాజీ పేర్కొన్నారు. స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ, చంద్రబాబుకు వేసిన క్యాష్ పిటిషన్లు, బెయిల్ రాలేదంటే ఎంత అవినీతి చేసి ఉంటాడో ప్రజల గమనించాలని అన్నారు. దేశం మొత్తం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వైపు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మహిళలకు ఆయన కల్పిస్తున్న సదుపాయాలను గమనిస్తున్నారన్నారు.తూర్పుగోదావరి జిల్లాలో వైయస్సార్ పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటూ అనేక పదవులను పొందిన తనకు పాయకరావుపేట ఎమ్మెల్యే టికెట్ ఇస్తే తప్పకుండా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, జగన్మోహన్ రెడ్డి మాటే తనకు శిరోదాయకమని ఈ సందర్భంగా తెలిపారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు పూనెం సత్యనారాయణ

కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి-చింతూరు : వివిధ రంగాల కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం జరిగిన సిఐటియు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను, హక్కులను కాలరాస్తున్నాయని, కనీస వేతనాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని, రాబోయే రోజుల్లో అన్నింటినీ ప్రైవేట్‌కు అప్పగించడమే మోడీ ప్రభుత్వ లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా, అరెస్టులు, గృహ నిర్బంధాలతో పోరాటాలను అణచివేసే ప్రయత్నం చేస్తుందన్నారు. కొత్త కొత్త యాప్‌లు తీసుకొచ్చి స్కీమ్ వర్కర్స్‌పై తీవ్రమైన పని ఒత్తిడి పెంచుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే కార్మికులందరూ ఏకమై ఓటుతో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, సిఐటియ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సవలం వెంకటరమణ, పొడియం లక్ష్మణ్, నాయకులు మడకం శ్రీదేవి, శేషమ్మ, తిరుపతమ్మ, కన్నమ్మ, రాములమ్మ, రామచంద్రయ్య, సోమయ్య, వీరమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రుల ఉత్సవాలకు రాట

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరులో దేవీ నవరాత్రులు ఉత్సవాల ముహూర్తపురాట సోమవారం దుర్గాదేవి షెడ్‌లో వేశారు. ముహూర్తపురాటకు కిషోర్ దంపతులు పీట్లపై కూర్చొని పూజా కార్యక్రమాలు చేశారు. దసరా ఉత్సవాలు సీలేరులో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. సీలేరులో దసరా ఉత్సవాలు మొదలుపెట్టి 32 సంవత్సరాల పూర్తి కావస్తుంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రామకృష్ణ, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచి దుర్జు, ఉప సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

మద్యం అమ్మకాలతో..
జగన్ జేబులోకి నెలకు రూ.5 వేల కోట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని మద్యం అమ్మకాలలో నెలకు రూ.5 వేల కోట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జేబుకు వెళ్తున్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. సోమవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మద్యపాన నిషేధం అమలు చేస్తేగానీ మళ్లీ ఓటు అడగనని సిఎం జగన్ జనాన్ని మోసపుచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఒక్క మద్యం మీదనే రూ.98 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తోందన్నారు. ఇది ఒక చిన్న రాష్ట్రం బడ్జెట్‌తో సమానమని పేర్కొన్నారు.

నాణ్యత లేని మద్యం సేవించడం వల్ల ఉదర, కిడ్నీ సమస్యలతో పెక్కు మంది ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. ఒక్క కెజిహెచ్‌లోనే గడిచిన మూడు నెలల్లో 1075 మంది మద్యం వల్ల అనారోగ్యంతో చేరారన్నారు. ప్రభుత్వానికి మద్యం ద్వారా పెద్ద మొత్తంలో ఆదాయం వస్తున్నా.. ఉద్యోగులకు మాత్రం పదో తేదీ వచ్చినా జీతాలు వేయడం లేదని ఎద్దేవా చేశారు. పథకాలు పేరు చెప్పి బటన్ నొక్కుతూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఏ కొద్ది మందికో పథకాలు అమలు చేసి లక్షల మందికి ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. రోజా మహిళల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

మీడియాపై దాడులు అమానుషం

న్యూస్ క్లిక్ ఎడిటర్ అక్రమ అరెస్టుపై సిఐటియు నిరసన

ప్రజాశక్తి- అనకాపల్లి

మోడీ ప్రభుత్వంలో పత్రికా రంగంపై దాడులు పెరగడం అమానుషమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు విమర్శించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కథనాలు రాసిన న్యూఢిల్లీలోని న్యూస్ క్లిక్ ఎడిటర్ పుర్కాయస్థపై కక్ష కట్టిన మోడీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ న్యూస్ క్లిక్ ఎడిటర్ పుర్కాయస్థ అరెస్టు పత్రిక రంగానికి, మీడియా రంగానికి ఆందోళన కలిగిస్తున్న అంశమన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి కాంతారావు మాట్లాడుతూ మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా మీడియాపై దాడులకు పాల్పడిన సంగతిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, నాయకులు ఈశ్వరరావు, అల్లు రాజు, విలేకరులు ఎం.అజయ్, ఆత్మారాం, అనకాపల్లి రామస్వామి, రమణ, శ్రీనివాస్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి బి.నూక అప్పారావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన నిరసన

ఢిల్లీలో న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టును నిరసిస్తూ, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలో జర్నలిస్టులు సోమవారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనం నుండి నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి, ఏవో రవి కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులపై రోజు రోజుకూ దాడులు పెరుగుతున్నాయన్నారు. ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.కాంతారావు మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేపట్టిన ఉద్యమాలకు అనుకూలంగా వార్తలు రాయడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనపై కక్ష సాధింపునకు పూనుకుంటుందని విమర్శించారు. మీడియాపై దాడులు, జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బి.కొండలరావు, కార్యదర్శి పి.రామకృష్ణ, ఫెడరేషన్ ప్రతినిధులు మార్టూరు అజయ్, గంటా శ్రీనివాసరావు, బాషా, రాజా, రమేష్, పి.నాగ, కె.మోహన్ బాబు, పి.రామారావు, కె.గణేష్, పి.సత్యనారాయణ, నటరాజ్, గంగాధర్, బొడ్డేడ శ్రీను, నాయుడు, కుమార్, మణి కుమార్, ఎన్.వెంకటరమణ, దేవుడు బాబు, స్వామి, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విశాఖ జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ప్యాడీ ప్రొక్యూర్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం ఉత్పత్తి ఏ స్థాయిలో జరుగుతుందో అంచనా వేసి అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇ-క్రాప్ బుకింగ్, ఇకెవైసి తప్పనిసరిగా చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక ఆర్‌బికెలకు అనుసంధానం చేసి ప్రక్రియ సజావుగా సాగేలా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. క్లస్టర్ ఆర్‌బికెలలో టెక్నికల్ అసిస్టెంట్లు జిల్లాలో గన్నీ బ్యాగులు ఏ మేరకు అవసరం అవుతాయో గుర్తించి, మిల్లర్ల నుంచి సేకరించి నిల్వ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా సంబంధిత వాహనాలకు జిపిఎస్‌కు అనుసంధానం చేయాలని డిటిసికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లైస్ ఐ.రాజేశ్వరి, ఎం.బుచ్చిరాజు పాల్గొన్నారు.

కైలాసగిరిపై తవ్వకాలు ఆపాలని వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : చినగదిలి మండలంలోని సర్వే నెంబర్ 150లో నిబంధనలకు విరుద్ధంగా కైలాసగిరి కొండను తవ్వేసి వ్యాపారాల కోసం చేపడుతున్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి రుషికొండలో పెద్ద ఎత్తున విధ్వంసానికి పాల్పడుతున్నారన్నారు. ఎయులోని చెట్లను కొట్టేసి పర్యావరణానికి విఘాతం కలిగించినా పట్టించుకోని ప్రభుత్వ ఉన్నతాధికారులపై తాము పోరాడుతున్నామన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకులు సురేష్ బాబు ఉన్నారు.



ఇన్ఫోసిస్ కార్యాలయంలో ఏర్పాట్లును పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సిఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఈ నెల 16న విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన రుషికొండ ఐటి సెజ్ ప్రాంతాలను జివిఎంసి అధికారులు, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఇన్ఫోసిస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభించే ప్రాంగణం, స్టేజీతో పాటు హెలీప్యాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించి ఇన్ఫోసిస్ ప్రతినిధులకు తగు సూచనలు చేశారు. కంపెనీ పరిసర ప్రాంతాలలో పారిశుధ్యం, విద్యుత్తు, రోడ్ల పరిశుభ్రత, రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు, గ్రీనరీ తదితర పనులను త్వరతగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు, ఎఎమ్ఒహెచ్ డాక్టర్ ఎన్.కిషోర్, కార్యనిర్వాహక ఇంజినీర్ శాంతి రాజు, డిఇ వంశీ పాల్గొన్నారు.

సొసైటీ భూమి అప్పగించరూ..

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : తమకు చెందిన 9.68 ఎకరాల భూమిని ఎపిఐఐసి సర్వే చేసి స్వాధీన పరచుకోవడంపై మైనారిటీస్ డవలప్‌మెంట్ సొసైటీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు షేక్ నూర్ అహ్మద్ కలెక్టర్ ఎ.మల్లికార్జునను సోమవారం కలిశారు. తమ భూమిని తమకు అప్పగించాలని కోరుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. 190 పేద కుటుంబాలకు చెందిన సర్వే నెంబరు 7/4ఎ2లోని 86 ఎకరాల భూమిని పెందుర్తి మండలం నరవ వియస్ఇజెడ్‌కు ఆనుకుని గతంలో ప్రభుత్వం తమకు ఇచ్చిందని తెలిపారు. 2006లో ఎపిఐఐసి అధికారులు ఒక ఇంగ్లీషు దినపత్రికలో అడ్వర్టయిజ్‌మెంట్ తెలుగులో వేసి తమకు తెలియకుండా వారికి అనుకూలంగా 9.68 ఎకరాలపై అవార్డు పొందారని ఆవేదన చెందారు. ఆ భూమిని తమ ముస్లిం మైనారిటీ పేద కుటుంబాలన్నీ 1984-1986 మధ్య కాలంలో న్యాయబద్ధంగా కొనుగోలు చేసుకున్నాయని, 2006లో ఎపిఐఐసి అర్ధాంతర జోక్యం చేసుకుని అవార్డు పొందడంతో తమ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయని వాపోయారు. తమ భూమి మొత్తాన్ని తమకు అప్పగించాలని కోరారు. భూమి విషయమై కోర్టుకు వెళ్తే తమకే అనుకూలంగా రిపోర్టు వచ్చిందన్నారు. మరలా 2011లో ఎపిఐఐసి కోర్టుకెళ్లి కేసు ఫైలు చేసి ఆ భూమిని చేజిక్కించుకుందని తెలిపారు. తక్షణం తమ భూమిని అప్పగించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశామని వివరించారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో తామే ఉన్నామని రోడ్లు, కరెంట్ వేయించుకున్నామని, ఇళ్లు కట్టుకోవాలని చూస్తుంటే ఆటంకాలు సృష్టిస్తున్నారని పేర్కొంటూ నూర్ సహా మరో నలుగురు మైనారిటీ ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి, వైసిపి నాటకాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వైసిపి, బిజెపిలు కపట నాటకాలు ఆడుతున్నాయని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. .స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 919వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా ఉద్యమం జరుగుతున్నా మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.